సజావుగా గ్రూప్-3 పరీక్షలు

- గణనీయంగా తగ్గిన అభ్యర్థుల హాజరు శాతం
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి నిరాకరణ
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, వికారాబాద్ ఎస్పీ

హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు సజావుగా ముగిసాయి. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పరీక్షకు 60 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టర్ నారాయణరెడ్డి తట్టిఅన్నారంలోని శ్రేయస్ ఇంజినీరింగ్ కళాశాల, హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అధికారులతో మాట్లాడి పరీక్ష కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల తరగతి గదులు, అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏలాంటి లోటుపాట్లు ఉండొద్దన్నారు. అభ్యర్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆయన సూచించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 13,380 మందికి 6,653 మంది గైర్హాజరయ్యారు. మిగతా డివిజన్ల పరిధిలో కూడా అభ్యర్థుల హాజరు శాతం గణనీయంగా తగ్గింది. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అధికారులు ఉన్నారు.

మొయినాబాద్ : గ్రూప్-3 పరీక్షలు మొదటి రోజు సజావుగా కొనసాగాయి. మొయినాబాద్ మండలంలో 6724 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్ష రాయడానికి 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జోగిన్‌పల్లి బీఆర్ ఇంజినీరింగ్ కేంద్రంలో 196, జేబీ ఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో 70, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 242, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 171, సుజాత పాఠశాలలో 116, గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో 224, కేఎల్‌హెచ్ డీమ్డ్ యూనివర్సిటీలో 180, చాలెంజర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 147, ఎన్‌టీఆర్ మాడల్ కళాశాలలో 139, విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

తాండూరులోని పరీక్షా కేంద్రాన్ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్


వికారాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో..



మొయినాబాద్ : చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో పరీక్ష పత్రాల బండిల్స్‌తో తహసీల్దార్ గౌతంకుమార్

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్ : గ్రూప్-3 పరీక్షలు ఆదివారం సజావుగా జరిగాయి. మొదటి సెషన్ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగాయి. వికారాబాద్ జిల్లాలో 10,196 మంది ఎగ్జామ్స్ రాయాల్సి ఉండగా 60% అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. మూడో సెషన్ పరీక్ష సోమవారం మధ్యాహ్నం జరుగనున్నది. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్నారు.

ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతించారు. మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించలేదు. ప్రతి కేంద్రం వద్ద తనిఖీలు చేపట్టారు. ప్రశ్నాపత్రాలు, ఇతర పరీక్ష సామగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎగ్జామినేషన్ సెంటర్స్‌కు తరలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసివేశారు. అన్ని కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించారు.

చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. వికారాబాద్ సిద్దార్థ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. ఎస్ఏపీ కళాశాలతోపాటు ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

994 మంది హాజరు

పరిగి : పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన పరీక్షకు 91680 మంది హాజరుకావాల్సి ఉండగా 994 మంది హాజరయ్యారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాల కేంద్రంలో 151, పల్లవి డిగ్రీ కళాశాల కేంద్రంలో 248, ఓగా బీఈడీ కళాశాల కేంద్రంలో 126, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కేంద్రంలో 357, న్యూ బ్రిలియంట్ స్కూల్‌లో 112 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు ముందుగానే సూచించగా కొందరు ఒక నిమిషం ఆలస్యంతో పరీక్షకు హాజరుకాకుండా వెనుదిరిగారు.

కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు

తాండూరు : గ్రూప్-3 పరీక్షలు ఆదివారం తాండూరులో ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య సజావుగా జరిగాయి. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అభ్యర్థులను ఉదయం 8.30 నుంచే పరీక్షా కేంద్రాలకు అనుమతించారు. పరీక్షా కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డితో కలసి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన కొందరు అభ్యర్థులను అనుమతించలేదు. సోమవారం మూడో సెషన్ పరీక్ష జరుగనున్నది.

అనంతుడి జాతరకు అశేష జనం

వికారాబాద్, నవంబర్ 17 : వికారాబాద్‌లో అనంతపద్మనాభస్వామి పెద్దజాతరకు వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా కోనేటి వద్ద స్నానాలు ఆచరించి శివాలయం, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం అనంతపద్మనాభస్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తిక మాసం కావడంతో ఉసిరి చెట్ల కింద దీపాలు వెలిగించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారిని ముత్యాల పందిరి పల్లకిపై ఊరేగించారు. పెద్దజాతర ఉత్సవాలు 25 వరకు జరుగుతున్నాయి. 25న స్వామివారి చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి. సోమవారం ఉదయం 11 గంటలకు గజవాహనోత్సవం జరుగనున్నది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

దర్శనం కోసం క్యూలో భక్తులు

ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబర్ 17 : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రజా పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన కళాయాత్రను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7 వరకు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి సన్నాహక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులచే జిల్లాలోని పెద్ద గ్రామపంచాయతీల్లో తిరుగుతూ ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పిస్తూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విజయోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ నేపథ్యంలో 18న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

కొడంగల్‌లో రెండు రోజులు విజయోత్సవాలు

తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కళాయాత్ర బృందం ప్రొఫెసర్ అలేఖ్య, నాగరాజు రాష్ట్రమంతా పర్యటిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ బృందాలు కొడంగల్‌లోని రాఘవేంద్ర గార్డెన్‌లో ఈ నెల 18న సాయంత్రం 6 గంటలకు ప్రొఫెసర్ అలేఖ్య బృందంచే ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 7న నాగరాజు బృందంచే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విజయోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అదేవిధంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డిల తోపాటు శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

జనసందోహంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

జన జాతర

బుగ్గ జాతరకు పోటెత్తిన భక్తులు

కిటకిటలాడిన ఆలయ పరిసర ప్రాంతాలు

వైభవంగా కొనసాగుతున్న రామలింగేశ్వరుడి ఉత్సవాలు

మంచాల, నవంబర్ 17 : బుగ్గరామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు మూడో రోజు కూడా వైభవంగా జరిగాయి. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. కుటుంబసమేతంగా వచ్చిన భక్తులు స్వామివారి సన్నిధానంలో ఉన్న గుండంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. కార్తిక దీపాలను వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. మంచాల సీఐ మధు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా మంచాల ఎంపీడీవో బాలశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఇబ్రహీంపట్నం నుంచి భక్తుల సౌకర్యార్థం బుగ్గ వరకు ప్రతి 20 నిమిషాలకో ఆర్టీసీ బస్సును నడిపిస్తున్నారు. భక్తులు స్వామివారి దర్శనానంతరం వన భోజనాలు చేశారు. అనంతరం ఆటవస్తువులు, స్వీట్లు కొనుగోలు చేశారు.

శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

జాతరకు భారీగా తరలివచ్చిన యాత్రికులు

ధారూరు మెథడిస్టు జాతరలో ప్రసంగిస్తున్న బిషప్ ఎన్ఎల్ కర్‌కరె

ముగిసిన మెథడిస్టు జాతర

ధారూరు, నవంబర్ 17 : ధారూరు మండల పరిధిలోని ధారూరు స్టేషన్-దోర్నాల్ గ్రామల మధ్య నిర్వహించిన ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఆదివారంతో ముగిసింది. 6 రోజులుగా నిర్వహించిన జాతరకు తెలంగాణ రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భారీగా యాత్రికులు తరలివచ్చారు. ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి కార్యక్రమాన్ని ముగించారు. మధ్యాహ్నం ఏసుప్రభువుకు మేకలు, కోళ్లు, గొర్రెలను దానంగా ఇచ్చారు. కానుకలను హుండీలో వేసి మొక్కులను చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం భక్తి గీతాలను ఆలపించారు.జాతరకు అంచనాకు మించి భక్తులు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. యాత్రికుల కోసం వికారాబాద్, తాండూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాతరలో బిషప్ ప్రసంగాన్ని ఆలకిస్తున్న భక్తులు

కన్హాలో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్

కన్హాలో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ చేస్తున్న విద్యార్థులు, క్రీడాకారులు, అభ్యాసకులు

నందిగామ, నవంబర్ 17 : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్, ఫిట్ ఇండియా సహకారంతో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ మూడో ఎడిషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, క్రీడాకారులు, అభ్యాసకులు వేల మంది 21కే, 10కే, 5కే, 2కే, 1.5కే రన్‌లలో పాల్గొన్నారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడటమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమంతో ఇప్పటికే వేల సంఖ్యలో మొక్కలు నాటామని నిర్వాహకులు తెలిపారు. మొక్కలు నాటడం, రన్నింగ్ చేయడం ద్వారా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమ, పారిస్ పారాలింపిక్స్ 2024 మహిళా టి20 విభాగంలో కాంస్య పతకం విజేత దీప్తి జీవన్‌జీ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్ పాల్గొన్నారు.